# ఏమయ్యిందో ప్రేమా...!

కోరం రాజబాబు



ఉదయాన్నే చినుకు మొదలైంది. తగ్గేలా లేదు. అందుకే రిలాక్సింగ్‌గా కుర్చీలో కూర్చుని టీవీ స్విచ్ ఆన్ చేసిందామె. అన్ని ఛానళ్లలోనూ సీరియల్సే. ఒకదాంట్లో స్త్రీ పాత్రలే రౌడీల్లా కొట్టుకుంటుంటే మరో ఛానల్‌లో అన్నీ ఏడుపులే వినిపిస్తున్నాయి. విసుగేసి కట్టేసింది. దిగజారిన సంస్కృతితో పాటు దిశ తెలియక ఎటో సాగిపోతున్న సీరియల్స్‌కు అంత క్రేజ్ ఎందుకో అర్థం కాలేదామెకు. కాసేపు మౌనంగా కళ్లు మూసుకున్నాక ఆ దృశ్యాలన్నీ ప్రక్కకు జరిగాయి. కళ్లు తెరవాలనిపించలేదామెకు. కాసేపటికి మరో దృశ్యం నెమ్మదిగా ఆమె కళ్లలో నిలిచిపోయింది. ఎంత భావుకత అతనిలో. అంత గొప్ప పెర్స్పెక్టివ్ ఉన్న వ్యక్తి అలా చేసాడేంటి? ఏమైందతనికి? నా పద్ధతి అతనికి నచ్చ లేదా? లేక నేనే అతనికి నచ్చలేదా? కలవరపాటుగా అనుకుందామె.

సెలయేటి అందాలు, చిరుగాలి సవ్వడులు, అతని భావాల్లో దొర్లుతాయి. తొలిపొద్దులా నులి వెచ్చగా అతని మాటలుంటాయి. అతనితో జీవితం ఎందుకోగాని బాగుందనిపించింది. అతను అలా అనుకోలేదా! ఎక్కడో ఏదో జరిగింది. అతని గురించి ఆలోచిస్తుంటే గుండెలో బాధ తెలుస్తోందామెకు! కళ్లకు బాధ తెలీకపోయినా కన్నీళ్లు ఎందుకు రాలుస్తాయో మనసుకే తెలుస్తుంది.

తొలిసారి అతని గురించి ఇంతగా ఆలోచించేసరికి మనసు బరువెక్కి పోయింది. అంతలోనే ఒళ్లు మండి పోయింది కూడా. జీవితం ఎవరిష్టం వాళ్లదే అనుకుంటే ఈ బంధం ఎందుకు? స్వేచ్ఛ ఉందని అలా చేశాడా? కోపం నెమ్మదిగా పెరిగి ఆమె మనసును కమ్మేసింది. అయినా అతని కోసం ఎందుకు ఏడ్వాలి? నా జీవితం నాకున్నప్పుడు అతను లేకుండా బ్రతకలేనా? నెమ్మదిగా సర్దుకున్న ఆమె మనసు కాసేపటికి ధైర్యాన్ని తెచ్చుకుంది.

అయినా సరే... ఆమె ఆలోచనలు మాత్రం అతన్ని వదిలి పెట్టలేదు. గడిపిన జీవితపు అనుభూతుల్లో చిక్కుకుపోయాయి.

000

ప్రేమ్...నీకు నా మీద కోపంగా ఉందా?

కోపమా! దేనికి?

“మరెందుకు ఏదీ పట్టనట్టు ప్రవర్తిస్తావు. నీ లోకంలో నువ్వుంటూనే నా కోసం అన్ని పనులూ చేస్తావ్ గాని నా ఆలోచనలకు ఎందుకు దగ్గరగా ఉండవు” శశి కోపంగా ఆవేశంగా అడిగింది.

ప్రేమ్ మౌనంగా చెంపమీద చేయి ఆన్చి కొంచెం ముందుకు వంగి కూర్చున్నాడు.

“ఏంటి మాట్లాడవు?” రెట్టించింది శశి.

“నిన్ను చూస్తున్నాను.” చెప్పాడు ప్రేమ్.

“నిజం చెప్పు! నన్ను చూస్తున్నావా?”

“అవును... చాలా స్పష్టంగా నిన్ను చూస్తున్నాను. ఇలా చూసే అవకాశం ఎప్పుడో గానిరాదు కదా” ప్రేమ్ గొంతులో చిన్నతడబాటు.

శశి కళ్లు క్షణం నేలకు వాలాయి. అంతలోనే తడబాటును పైకి కనబడకుండా... “ఏంటి నువ్వంటున్నది?”

నేను ఉదయమే వెళ్లి సాయంత్రం తిరిగొస్తాను. వూపిరాడని పనితో సతమతమవుతూ అలసిపోయి ఇంటికొస్తాను. ఆ విషయం నీకు తెలీదా?”

“నువ్వెందుకు అలా ఎగ్జైట్ అవుతావు. నేను నీ కష్టాన్ని గుర్తించలేదని బాధపడుతున్నావా?”

“నేను నీ గుర్తింపుకోసం కష్టపడటం లేదు. నేను నీలా కష్టపడకుండా కాలం గడపలేను. ఏ పనీ చేయకుండా కాలాన్ని గడిపేయడం నాకు నచ్చదు.”

"ఆ విషయం చాలాసార్లు చెప్పావు! నువ్వు ఉద్యోగం చేస్తున్నావు. అందుకే నీతో పాటే నేనూ రెండుపూటలా తింటున్నాను. శశీ... నిన్నర్థం చేసుకోలేకపోవడం నా బలహీనత మాత్రం కాదు. నిన్ను ఇలా చూడాలనుకోకపోవడం నా బలహీనత" ప్రేమ్ గొంతులో బాధ ధ్వనించింది.

"ఐ యామ్ సారీ ప్రేమ్. నీకు చాలా సార్లు చెప్పాను. జీవితం అంటే నాకున్న పెర్‌స్పెక్టివ్ ఎలాంటిదో. నాకంటూ ఓ వ్యక్తిత్వం ఉంది. అలాగే బలహీనత కూడా ఉంది. అదేంటో తెలుసా? నాకు నచ్చినట్లే బ్రతకడం. నువ్వు కోరుకున్నట్లు... ప్రతి పనిలోను మనసుకు దగ్గరగా ఉండాలంటే సాధ్యం కాదు. మనం చేసే ప్రతి పనికి సంబంధించి ఫీలింగ్స్ ఉంటాయి. అయితే వాటినే పట్టుకుని బ్రతికేయాలంటే ఎలా చెప్పు. ఉన్న కొద్ది జీవితంలో ఏదో సాధించాలని ఉంటుంది నాకు. అంతేకాదు ప్రతి చిన్న విషయానికి నీ సలహా తీసుకుని వ్యక్తిత్వం లేనిదానిలా బ్రతకడం కూడా చాతకాదు. నాకంటూ కొన్ని ఇష్టాలు ఉంటాయి. వాటిని ప్రదర్శించటానికి నేను వెనుకాడను."

"ఇక్కడ నువ్వు అర్థం చేసుకోవలసింది మరొకటుంది. నువ్వంటే ఇష్టం, ప్రేమ ఉన్నాయి. భర్తగా నీ మీద గౌరవమూ ఉంది. అయితే నా వ్యక్తిగత విషయాలకు, మనిద్దరి జీవితానికి సంబంధం లేదు" చెప్పడం ఆపి ఓ క్షణం ప్రేమ్ వైపు సూటిగా చూసింది శశి.

"అర్థమయ్యింది శశి. ఇలా చెప్పడం మూడోసారనుకుంటాను" చాలా నెమ్మదిగా, కూల్‌గా అన్నాడు ప్రేమ్.

శశి మాట్లాడలేదు. కాసేపటికి "ఆఫీసుకు టైం అయ్యింది" అంటూ లేచి వెళ్లింది.

000

ఇద్దరివీ విభిన్నమైన ఆలోచనలే. ఇద్దరూ నష్టపోతున్నారని తెలిసినా ఒకరి మార్గంలోకి మరొకరు వెళ్లరు. జీవితం అందంగా, హాయిగా సాగిపోవాలనుకునే మనస్తత్వం ప్రేమ్‌దయితే... జీవితాన్ని నచ్చినట్లు నడిపించా లనుకోవడం శశికి ఉన్న ఆరాటం. ఆమె జీవితాన్ని గెలవాలను కుంటోంది. అతను మాత్రం జీవితమంటే ఆమే అనుకుంటున్నాడు.

అయితే ఆమె ఆలోచనల ముందు అతను ఓడిపోయాడు. ప్రతి ఆలోచనా ఆశయమే అయితే జీవితమే ఉండకపోవచ్చు. అందుకే ఓడిపోవడానికే ఇష్టపడ్డాడు. ఒంటరితనం ఒక్కోసారి గుండె నిబ్బరాన్ని కల్గిస్తుంది. నేనున్నానంటూ ఎక్కడికి వెళ్లినా ఓదారుస్తుంది.

ప్రేమ్ గందరగోళానికి గురికాలేదు. తన మనసుకు నచ్చినట్లు మొదటిసారిగా చేయాలను కున్నాడు. శశికి చెప్పకుండా వెళ్లిపోయాడు.

000

శశి టీవీ స్విచ్ ఆన్ చేసి ఛానళ్లన్నీ మారుస్తోంది. ఎక్కడా మనసు నిలవడం లేదు. ఏమైంది నాకు అనుకుంటూనే గట్టిగా నిట్టూర్చి ప్రేమ్ రాసిన లెటర్ వైపు మరోసారి చూపుల్ని నిలిపింది.

"డియర్ శశీ...

నిన్నిలా పిలుస్తూ లెటర్ రాయాలని నేనెప్పుడూ అనుకోలేదు. కాని తప్పలేదు. నాకు ఉద్యోగం లేని మాట నిజం. సడన్‌గా నేను నీలా సంపాదించలేను. అందుకేనేమో నీలా నేను ఆలోచించలేకపోతున్నాను. నాకు పౌరుషం, ఆత్మాభిమానం లేవని కాదు. వాటికన్నా నీతో జీవితం నాకు ముఖ్యం. అదీ నాకు నచ్చిన జీవితం. అదేంటో చెప్పనా?

తీయగా పలకరించుకోవడం, ప్రేమతో ప్రతి విషయాన్ని షేర్ చేసుకోవడం, కంటిచూపు కొంటెతనాన్ని కూడా ఫీలింగ్స్‌లో బంధించుకోవడం, ప్రతి చిర్నవ్వునూ ఆతృతగా అందుకోవడం, ప్రతి జ్ఞాపకాన్ని మనసులో దాచుకోవడం ఇలా...ఒక్కటేంటి! చాలాచాలా ఉన్నాయి.

నేనెందుకు సడన్‌గా వెళ్లానో నీకు అర్థం కాలేదు కదూ! నీ మీద కోపంతో మాత్రం కాదు. జీవితంపై విరక్తి కలిగికాదు. ఒంటరిగా కొన్ని రోజులు ఎక్కడన్నా గడపాలనిపించి వెళ్లాను. నిన్ను వదిలేసి వెళ్లటం తప్పే అనుకో.

అయితే... నిన్ను వదిలి ఈ కొద్దిరోజులు కూడా నేను ఒంటరిగా ఉండలేకపోయాను. స్నేహితుల్ని కలిశాను. ఇష్టమైన చోట్లన్నీ తిరగాను. కానీ నువ్వు లేని ప్రతి క్షణాన్ని గడపటం నాకు చాలా కష్టమనిపించింది.

అన్నట్టు...నీకో నిజం చెప్పనా? నువ్వు రాత్రి పది దాటితే నిద్రపోతావు. నువ్వు నిద్రపోతున్నప్పుడు నాకు నువ్వంటే ప్రేమ ఎక్కువవుతుంది. అప్పుడు నిన్ను లేపడం నా కిష్టముండదు. నిన్నలా చూస్తూ ఉండిపోవడం చాలా ఇష్టం. అలా చాలా రాత్రులు చేశానులే...నీకు తెలీదనుకో.

మరో ఇంట్రస్టింగ్ న్యూస్ చెప్పనా? ఈ రోజే పేపర్లో చూశాను. నేను రాసిన భావ కవితల సంపుటికి జాతీయస్థాయిలో అవార్డు వచ్చింది. అందుకే నే నింటికి వచ్చేస్తున్నాను. నువ్వు నాకోసం ఎదురు చూస్తావని కాదు...నా సంతోషాన్ని నీతో పంచుకోవాలన్న ఆశతో మాత్రమే.

నీ ప్రేమ్..

000

రాత్రి పది దాటింది. శశి ఇంకా మెలుకువగానే ఉంది. అస్సలు నిద్రే పట్టకపోవడం ఆమెకు వింతగా అన్పించింది. ప్రేమ్‌ను తొలిసారిగా చూడబోతున్న ఫీలింగ్ ఆమెలో. ప్రేమ్‌ను తనెలా చూసింది! ఎలా ట్రీట్ చేసింది తెలుస్తోందామెకు. సిగ్గుతో ముఖం చిన్నదయిపోయింది. దేని విలువైనా పూర్తిగా తెలిశాకే దానిమీద అభిప్రాయాలు ఏర్పడతాయి. ఇప్పుడెందుకో ప్రేమ్ కళ్లలో కదులుతుంటే కళ్లు మూసుకోవడం కూడా ఇష్టం లేదామెకు. ప్రేమ్ రాక కోసం ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తోంది. వ్యక్తిత్వం కాపాడుకోవడం, ఆత్మాభిమానాన్ని పెంచుకోవడం అంటే ఇలా కాదేమో అన్న అనుమానం తొలిసారిగా వచ్చిందామెకు.

మనసంతా నిండిపోయిన స్పందనలు ఒళ్లంతా పాకేసరికి వూపిరాడనంత పనైంది శశికి. ఏదో ఆలోచిస్తోంది. దేనిగురించో ఆతృత పడుతోంది. ఏదో తపన, మరేదో తన్మయత్వం, ఎదురు చూడటంలో ఉన్న తీయదనాన్ని రుచి చూస్తుందామె.

ప్రేమ్! నీకోసం నేనేం ఇవ్వగలను? అస్సలు నీకెలా చెప్పాలి నీ కోసం ఎదురు చూస్తున్నానని. ఆమెలో చెలరేగిన భావాలు పైకి వచ్చేస్తుంటే ముసిముసిగా నవ్వుకుంటోందామె.

ఆమె నవ్వును చూస్తుంటే రాత్రికి కూడా సిగ్గేసిందేమో... ఏటో పారిపోయింది. అతని కోసం ఆమెను ఒంటరిగా వదిలేసి...!

■

